## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

■ వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి,నవంబర్ 23: ఎన్నికల విధులు నిర్వహించే ఇతర నియోజకవర్గాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకోనేందుకు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఈనెల 23వ వతేదీ నుంచి 25వతేదీ వరకు కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌నందలాల్ పవార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో ఉద్యోగం చేస్తూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులలు, పోలీసు సిబ్బందికి 25వ తేదీ నుంచి 27వరకు వనపర్తి ఐడీవోసీలోని రూంనెంబర్ 2లో ఓటింగ్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అత్యవసర విధుల్లో ఉండే సిబ్బందికి 25నుంచి 27వరకు ఐడీవోసీలోని రూంనెంబరు 10లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే విధంగా సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ తమ ఓటును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామని, ఓటర్ల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 25న పీజీ సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

బిజినేపల్లి, నవంబర్ 23: మండలంలోని పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పీజీ తెలుగు కోర్సులో 2023-24 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్లను ఈనెల 25న స్పాట్ కౌన్సెలింగ్‌లో సీపీగేట్-2023 నిబంధనల ప్రకారం భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ విద్యారాణి గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ తెలుగులో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. డిగ్రీలో 50శాతం మార్కులు కలిగిన వారు 3పాస్‌ఫొటోలు, 3 జతల జిరాక్స్, ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలని తెలిపారు. విద్యార్థులు కోర్సు ఫీజుతోపాటు యూనివర్సిటీ ప్రాసెసింగ్ ఫీజు రూ.2100 చెల్లించాలని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లలో చేరిన విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్ వర్తించదని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాన్‌గల్, నవంబర్ 23: మండలంలోని అన్నారం సమీపంలో ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొనగా బైక్‌పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై వేణు కథనం ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన గడ్డం బాలపీరు(29) వృత్తిరీత్యా ప్రైవేట్ డ్రైవర్. విధుల నిమిత్తం గురువారం అన్నారం నుంచి బైక్‌పై వనపర్తికి బయలుదేరాడు. వనపర్తి నుంచి కొల్లాపూర్ వస్తున్న ఆర్టీసీ బస్సు మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న బాలపీరు ఎగిరి రోడ్డు పక్కనున్న రాయిపై పడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బాలపీరు భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి ఏరియా దవఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ట్రాక్టర్ ప్రమాదంలో మహిళ దుర్మరణం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెబ్బేరు, నవంబర్ 23: మండలంలోని జనుంపల్లి శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని పెంచికలపాడుకు చెందిన కాటపాగ పార్వతమ్మ(32) రంగాపురం నుంచి ట్రాక్టర్‌పై స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నుంచి ట్రాలీ వీడిపోయింది. ట్రాలీలో ఉన్న ఆమె కిందపడడంతో తీవ్రగాయాలై మృతిచెందింది. మృతురాలి తల్లి అక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## మద్యం పట్టివేత

గోపాల్‌పేట, నవంబర్ 23: మండలంలోని చాకల్‌పల్లిలో అక్రమంగా తీసుకెళ్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకొని కేసునమోదు చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామానికి చెందిన పి. కృష్ణయ్య గురువారం గోపాల్‌పేట నుంచి గ్రామానికి మద్యం అక్రమంగా మద్యం తరలిస్తుండగా చాకల్‌పల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. తనిఖీలో 96 బాటిళ్ల 90 ఎం ఎల్ మద్యం సీసాలు దొరికినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## డిసెంబర్‌నె లాఖరులోగా..

# సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి అందించాలి

■ సకాలంలో బియ్యాన్ని అందించని మిల్లర్లకు వర్షాకాలం వడ్లు నిలిపివేయాలి

■ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్



కమిషనర్‌ను సన్మానిస్తున్న మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు



మిల్లును తనిఖీ చేస్తున్న కమిషనర్ అనిల్‌కుమార్

నాగర్‌కర్నూల్, నవంబర్ 23: జిల్లాలో 2022-23 రబీ, ఖరీఫ్ సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని సంబంధిత మిల్లర్లు సత్వరమే డిసెంబర్ నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి అందజేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లాలోని మిల్లర్లు, సంబంధిత శాఖ అధికారులతో గత ఖరీఫ్, రబీ, 2022-23 సీఎంఆర్ బియ్యంపై ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ మాట్లాడుతూ.. గత ఖరీఫ్, రబీ 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం నాగర్‌కర్నూల్ జిల్లాలో 109 మిల్లులకు 2,99,663 మెట్రిక్ టన్నుల వరిధాన్యం అందించగా మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి 2,15,98000 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం అందించాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం 23శాతమైన 45,645 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే అందించి నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలోని చివరిస్థానంలో ఉందని ఆయన మిల్లర్లపై అసహనం వ్యక్తం చేశారు. డిసెంబర్ 31 నాటికి 1,55,953 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అందించాలని ఆదేశించారు. సీఎంఆర్ బియ్యం పూర్తిస్థాయిలో అందించలేకపోవడంపై మిల్లర్లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 31వరకు సీఎంఆర్ గడువు పెంచడంతో బియ్యం అందించని మిల్లర్లు ఆదిశగా సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా మిల్లర్లు సీఎంఆర్ బియ్యానికి సంబంధించి వ్యయపట్టికలు సరిచూసుకోవాలని, అలాగే ఎప్పటికప్పుడు సంబంధిత నివేదికలు కార్యాలయంలో అందించాలని సూచించారు. సీఎంఆర్ బియ్యం అందించని మిల్లుల వారీగా అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. 60నుంచి 80శాతం ఉన్న మిల్లులు వందశాతం పూర్తిచేసి ఎఫ్‌సీఐకి సత్వరమే సీఎంఆర్ బియ్యం పెట్టాలని అలాగే సీఎంఆర్ పూర్తిచేసిన మిల్లర్లతో షేరింగ్ చేసుకొని నిర్దేశించిన గడువులోగా అందించాలని బకాయి మిల్లర్లకు సూచించారు. అదేవిధంగా 2021 యాసంగికి సంబంధించి 6,900మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం కూడా ఇప్పటివరకు ఎఫ్‌సీఐకి పెట్టని మిల్లులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ తెలంగాణ నుంచి 20లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ తీసుకునేందుకు అనుమతిచ్చిందని తెలిపారు. మిల్లర్లు అందరూ సకాలంలో సీఎంఆర్ బియ్యాన్ని త్వరితగతన అందించేందుకు రోజుకు 2వేల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర సివిల్ సప్లయికి రోజుకు 500 టన్నుల బియ్యాన్ని అందించాలని సూచించారు. ఇప్పటి వరకు బియ్యాన్ని సకాలంలో అందించని మిల్లులకు ఈసారి వర్షాకాలం వరి ధాన్యాన్ని అందించకూడదని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సీఎంఆర్‌కు బియ్యాన్ని అందించేందుకు మిల్లర్లపై ఒత్తిడి పెంచాలని ఆదేశించారు. మిల్లర్ల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మిల్లర్ అసోసియేషన్ నుంచి ఆయనను శాలువా, పూలబొకేతో సన్మానించారు. అనంతరం ఆయన నాగర్‌కర్నూల్, నెల్లికొండ, సత్యసాయి బారాబైల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో ఉన్న వరి ధాన్యం, బియ్యం విలువలను ఆయన పరిశీలించారు. సమావేశంలో డీఎస్‌వో స్వామి, సివిల్ సప్లయ్ డీఎం బాలరాజు, ఏఎంవో రాజేందర్, డీటీలు, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి రవి, నవీన్, హాకీం రాజేశ్, ప్రతాపరెడ్డి మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా పోలీసుశాఖ

■ వనపర్తి ఎస్పీ రక్షితా కృష్ణమూర్తి

■ కానిస్టేబుల్ బాలరాజు కుటుంబానికి పరామర్శ

■ పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



కానిస్టేబుల్ భార్యను ఓదార్చుతున్న ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి



కానిస్టేబుల్ బాలరాజు పార్థివదేహంపై పూలమాల వేస్తున్న ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి

వనపర్తి టౌన్, నవంబర్ 23: విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు సంబంధిత శాఖ అండగా ఉంటుందని వనపర్తి ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి రోడ్డుప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ బాలరాజు కుటుంబాన్ని ఎస్పీ గురువారం పరామర్శించారు. ముందుగా కానిస్టేబుల్ బాలరాజు పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కానిస్టేబుల్ సతీమణి మంజులను ఓదార్చి తనకు అన్నివిధాలుగా అండగా నిలుస్తామని చెప్పారు. అనంతరం పోలీస్ లాంఛనాలతో కానిస్టేబుల్ బాలరాజు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో అదనపు ఎస్పీ రాందాస్‌తేజావత్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐలు మహేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు అప్పలనాయుడు, యుగంధర్‌రెడ్డి, వివిధ మండలాల ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

## ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

అమరచింత, నవంబర్ 23: టైంకు అన్నం తినడంలేదని తోటి విద్యార్థుల ఎదుట నాన్నమ్మ మందలించడంతో ఇంట్లో చీరతో ఊరేసుకుని విద్యార్థినిని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో చోటుచేసుకున్నది. అమరచింలోని శ్రీకృష్ణనగర్‌కు చెందిన పద్మమ్మ, రమేశ్ కూతురు ప్రణవి ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. గురువారం పాఠశాలకు అన్నం తినకుండా వెళ్లింది. నాన్నమ్మ మధ్యాహ్నం అక్కడికి వెళ్లి తోటి విద్యార్థుల ఎదుట మందిలించడంతో ఇంటికెళ్లిన ప్రణవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

## పంట అమ్మిన రూ.2.50లక్షలు చోరీ

కొత్తకోట, నవంబరు 23: పట్టణంలోని ఏపీజీవీ బ్యాంకులో కానాయపల్లి గ్రామానికి చెందిన ఆర్.శ్రీనివాసులు గురువారం ఉదయం 12:30 గంటలకు వరిపంట అమ్మిన డబ్బులు ఖాతాలో జమ అయ్యాయి. సంబంధిత డబ్బులు డ్రా చేసుకొని స్వీట్‌హౌస్ వద్ద నిలిచాడు. అది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి బైకులో ఉన్న రూ.2.50లక్షల నగదును చోరీ చేశారు. బాధితుడు తన బ్యాంకు నుంచి డ్రా చేసుకునే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తనను వెంబడించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.